"మా ఇంటినెంబరు ఇది. రేపు సాయంత్రం ఒక్కరూ రండి. లావణ్య"

వేణుకు బోయింగ్ 737లో వెళుతున్నట్లుగా వుంది. బస్సుదిగి తన అన్నయ్య ఇంటికివెళ్ళి, లావణ్యని ఊహల్లో పొందుపరచుకుని నిద్ర పోయాడు.

తెల్లవారింది.

ఆ సాయంత్రం వరకు ఎలాగడిపాడో వేణుకు తెలియదు. క్వార్ట ర్స్‌వేపు బయలుదేరాడు. ఒకో క్వార్టర్ నంబర్ చూసుకుంటూ నడవ సాగాడు. ఐదు క్వార్టర్స్ దాటితే ఆమె యిల్లు వస్తుంది.

అరె! ఎర్రటి బోర్డు వుందేమిటి? బహుశః వాళ్ళ నాన్నగార్కి ఎర్రనిరంగంటే ఇష్టం అయివుండచ్చు.

ఆ క్వార్టర్ దగ్గరగా వెళ్ళేడు.

ఆ క్వార్టరు పోలీస్ అవుట్ పోస్ట్! యూనిఫారంలోవున్న కాని స్టేబుల్‌ని చూసి, తడబడి, వేణు వెంటనే వెనుదిరగడం తప్పితే ఇంకేం చేయగలడు?

....0....

# చలన చిత్రం

ఆంధ్రదేశంలో అది ఒక సినిమా హాలు. ఆ హాలులో ఆంధ్రలో తిరుగులేని కథానాయకుడిగా పేరొందిన నటుడు నటించిన 'కట్టెపట్టిన వీరుడు' ఆడుతోంది. ఇదేమిటి 'కత్తి పట్టిన వీరుడు' కాకుండా ఈ 'కట్టె' ఏమిటని మీరు ఆశ్చర్యపోవద్దు. ఆ సినిమాలో హీరో చేతిలో ఒక పొడుగాటి 'కర్ర' కత్తికంటె, ఇనుప రాడ్‌కంటె బలంగా తయా రవుతుంది. అదేం చిత్రమో దానితో కొన్ని వందల మందిని హత మారుస్తాడు. ఎదుటి వాళ్లు కూడా అతన్ని చావ చితకకొడతారు. అయినా హీరోగార్కి క్రాఫ్ కూడా చెదరదు. దానితో లారీలు, చివరికి రైలింజను కూడా తుక్కు తుక్కు. సదరు సినిమా హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో నడుస్తోంది.

ఆ సినిమా చూడడానికి చైతన్య లైనులో నుంచున్నాడు. నిన్ననే వాళ్ళక్కగారి ఊరు వచ్చిన చైతన్య తమ ఊళ్ళో ఆ సినిమా తొందరగా రాదు కాబట్టి ఈ సినిమా తొందరగా చూసేయ్యాలను కున్నాడు.

అకస్మాత్తుగా చైతన్య దృష్టి అటు మళ్ళింది. పొడుగ్గా, ఎర్రగా, అందంగా వున్న ఒక అమ్మాయి క్యూవైపు ఆందోళనగా చూస్తోంది. చైతన్య వెంటనే లైనులోంచి తప్పుకుని బయటపడి ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళాడు.

"ఏమండీ టికెట్ కావాలా?"

"ఏం బ్లాకులో అమ్ముతున్నారా మీరు?"

"కాదు కావాలంటే మీకు టికెట్ సంపాదిస్తాను" అన్నాడు ఖంగుతిని.

"ఎందుకులెండి శ్రమ?" అంది ఆ అమ్మాయి తిప్పుకుంటూ.

"ఫర్వాలేదు డబ్బు ఇటు ఇవ్వండి" అంటూ చెయ్యి చాపాడు.

ఇంతలో

"ఎయ్ మిష్టర్ ఆ అమ్మాయితో నీకేం పని. పద పోలీస్ స్టేషన్‌కి" ఎక్కడ్నుంచి వచ్చాడో పోలీస్ వచ్చాడు.

"కాదండి.... నేను ఈ అమ్మాయికి"—

"పదవోయ్ అమ్మాయిల్ని ఏడిపించేవాళ్ళందరూ ఈ కాకమ్మ కధలే చెప్తారు" అంటూ చైతన్యను తీసుకువెళ్తూ ఆ అమ్మాయి వేపు తిరిగి

"ఇంకో నాలుగు కేసులు పట్టుకోమ్మా.... ఈ రోజుకు చాలు. రేపు చూసుకుందాం. రేపటితో ఈ నెలకు పట్టుకోవలసిన కేసులు అయిపోతాయి" అంటున్నాడు,

చైతన్య ఇది విని "అది కాదండీ...."

"హూష్! మాట్లాడిడ్తే తగలిస్తా పద" అన్నాడు పోలీస్.

—o—